పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, జనవరి 30: మండల కేంద్రంలోని రెండు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కుప్పలు, గింజలు ఎక్కువగా ఉన్నందునా, స్థల ప్రభావం వల్ల ఫిబ్రవరి 1 నుంచి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి కొనుగోళ్లను ప్రారంభించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు. రైతులెవరూ సీసీఐ కేంద్రాలకు తీసుకురావద్దని ఆయన కోరారు.

ఐదుగురికి స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు

దహెగాం, జనవరి 30: మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురికి స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు వచ్చాయి. ఇటీవల వెలువడిన ఫలితాల్లో మండలంలోని కామెర హేమ,కామెర గీత, బోర్కుట్ లలిత(పీకలగుండం),ముడిమడుగుల సౌజన్య(కమ్మర్‌పల్లి), స్వర్ణ (ఐనం) ఉద్యోగాలు సాధించారు. ఇందులో కామెర హేమ,కామెర గీత ఒకే కుటుంబానికి చెందిన వారు. కష్టపడి చదివినందుకు ప్రభుత్వ ఉద్యోగం రావడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వాంకిడి, జనవరి 30: మండలంలోని కనర్గాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యక్తి వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. కనర్గాం గ్రామానికి చెందిన నికొడే మోతీరాం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో సోమవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని ఆసిఫాబాద్ దవాఖానకు తరలించారు. మంగళవారం ఉదయం ఆసిఫాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బకాయిలు చెల్లించండి

బెజ్జూర్, జనవరి 30 : విద్యుత్ వినియోగదారులు బకాయిలను చెల్లించి అధికారులకు సహకరించాలని ఏఈ అంజల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం నేడు మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బకాయిలు చెల్లించని పక్షంలో విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని చెప్పారు. అదే విధంగా బకాయి ఉన్నవారిని గృహజ్యోతి పథకానికి అనర్హులుగా నమోదు చేస్తామని తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

కౌటాల, జనవరి 30: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన సూర్యభాయ్ వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 35 టీంలు పాల్గొనగా, ఫైనల్‌లో కౌటాల, చింతలమానెపల్లి టీంలు పోటీ పడ్డాయి. ఇందులో చింతలమానెపల్లి టీం గెలిచింది. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.7 వేలు నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్ గౌడ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు డబ్బా బాపు, నాయకుడు కత్తెరసాల రమేశ్, సీనియర్ ఉపాధ్యాయుడు మాదాను లూర్దురాజు, క్రీడాకారులు పాల్గొన్నారు..

పదవులు కాదు.. ప్రగతే శాశ్వతం

- పంచాయతీల పాలకవర్గాల సన్మానంలో కౌటాల ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్

కౌటాల, జనవరి 30: ప్రజాప్రతినిధులకు పదవులు శాశ్వతం కాదని, చేసిన ప్రగతే గుర్తింపు నిస్తుందని కౌటాల ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో సర్పంచులు, ఉపసర్పంచులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎంతో అదృష్టవంతులని, గ్రామాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. అధికారుల నుంచి అందిన సహాయ సహకారాలే అభివృద్ధికి బాటలు వేశాయని పేర్కొన్నారు. పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులను శాలువా, మెమోంటోలతో సన్మానించారు. ఇటీవల గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఏఈవోగా అవార్డు అందుకున్న ఘన్‌శ్యాంను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనూష, ఎంపీడీవో అబ్దుల్ నస్రుల్లా ఖాన్, ఏపీవో పూర్ణిమ, ఎంఏవో రాజేశ్, ఏపీఎం వెంకటరమణ, ఎంఈవో సోమయ్య, ఎంపీటీసీలు బొమ్మకంటి మనీష్, వసంత్ రావు, బసార్కర్ శిరీష, వనిత, కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, మాజీ ఎంపీపీ గంగారాం, మాజీ కో ఆప్షన్ మెంబర్ నయీం అహ్మెద్, తదితరులున్నారు..



కౌటాల సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్, ఎంపీడీవో నస్రుల్ల ఖాన్

సర్పంచ్‌లను సన్మానించిన ఎంపీపీ జాజిమొగ్గ సుజాత, జడ్పీటీసీ సముద్రాల సరిత

పెంచికల్ పేట్‌లో..

పెంచికల్ పేట్,జనవరి 30 గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకమని ఎంపీపీ జాజిమొగ్గ సుజాత, జడ్పీటీసీ సముద్రాల సరిత అన్నారు.మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఎంపీడీవో గంగాసింగ్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచులను శాలువాలతో సన్మానించారు. ఈ ఐదేండ్లలో 90 శాతం గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని కొనియాడారు. మండల కో ఆప్షన్ సాజిద్, సర్పంచులు జాజిమొగ్గ శ్రీనివాస్, సంజీవ్, రాజన్న, సుధాకర్, ఈశ్వరీ బాయి, కావ్య, చంద్రమౌళి,కళావతి, సుజాత, కమల ఎంపీటీసీ రాజన్న నాయకులు సముద్రాల రాజన్న, బండు, బాపురావు మరియు పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

దహెగాం, జనవరి 30: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. మండలంలోని గిరివెల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను మంగళవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తుందన్నారు. ఎంపీపీ కంభగౌని సులోచన, జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామరావు, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, సింగిల్ విండో చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్,వైస్‌చైర్మన్ రాపర్తి ధనుంజయ్,సర్పచ్‌లు కారు రాజన్న, ఎల్కరి సంజీవ్,సందికట్ల రమేశ్,ఈఈ అంజయ్య,వైద్యాధికారి రవళి,సీహెచ్‌వో సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య కేంద్రాలు ప్రారంభం

చింతలమానేపల్లి, జనవరి 30 : మండల కేంద్రంతో పాటు రవీంద్రనగర్-2, కర్జెల్లి గ్రామాల్లో రూ.20 లక్షలతో నిర్మించిన ఆయుష్ వైద్య కేంద్రాలను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రోగులు ఆయుష్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే డాక్టర్లను వైద్య సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం రవీంద్రనగర్-1 గ్రాంలో శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, డీఈ నర్సింహరావు, సందీప్‌రెడ్డి, డిప్యూటి డీఎంహెచ్‌వో సీతారాం, మాజీ జడ్పీటీసీ ఎల్ముల్లే మల్లయ్య, డా. అజీముద్దీన్, ఎంపీటీసీ మనోజిత్, సర్పంచ్‌లు సుశీల్ మండల్, చౌదరి నానయ్య, నాయకులు డుబ్బుల మురళీ, భీమేశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీల కార్యదర్శులతో సమావేశం

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 30: జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీల కార్యదర్శులతో జీపీల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండడంతో, వారి వద్ద ఉన్న డిజిటల్ కీలు ఎంపీడీవోలు తీసుకొని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, కార్యదర్శుల హాజరును పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల జాబితా రూపొందించాలని, జీపీల్లో 100 శాతం పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేంద్ర బృందం గ్రామపంచాయతీల తనిఖీకి వచ్చే అవకాశం ఉందని, రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సిద్ధం చేయాలని, ఈజీఎస్ సామాజిక తనిఖీలను చేపట్టాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 30: పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, ఉపాధ్యాయులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు తమ కార్యచరణ ప్రకారంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని, విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి ఆధారంగా, వెనుకబడి ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

సిర్పూర్(యు) జనవరి 30: మండల కేంద్రంలో మంగళవారం ప్రజా ప్రతినిధులు, నాయకులు మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్ రావ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ దౌలత్, రాయిసెంటర్ సర్మేడి ఆత్రం ఆనంద్‌రావ్, నాయకులు కాశీరాం, దత్తు, సుద్దాల శ్రీనివాస్, ఖలీల్ తదితరులున్నారు.

ఆయుష్ సెంటర్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుష్టు రహిత సమాజాన్ని నిర్మించాలి

- దహెగాం, వాంకిడి వైద్యాధికారుల పిలుపు

దహెగాం:మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

దహెగాం,జనవరి 30: కుష్టు రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దహెగాం వైద్యాధికారి స్పందన అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో కుష్టు నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను వివరించారు. లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సీహెచ్‌వో సంపత్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి, జనవరి 30: కుష్టుపై సంపూర్ణ సర్వే చేయాలని వాంకిడి వైద్యాధికారి వినయ్ ఉప్రే తెలిపారు. మండల కేంద్రంలోని శివకేశవ నగర్ ఎంపీపీఎస్ పాఠశాల, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు రోగులపై ప్రేమానురాగాలు కలిగి ఉండాలని, సిబ్బంది, విద్యార్థులకు సూచించారు. మండలంలో 15 రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, కళశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో లక్ష్యసాధనపై ఏకాగ్రత

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 30 : క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసంతో పాటు లక్ష్యసాధనలో ఏకాగ్రత పెంపొందుతుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.జిల్లాలోని అంకుసాపూర్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్ కుమార్, తో కలిసి మంగళవారం వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో పాటు విద్యలో కూడా రాణించవచ్చని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో జిల్లాలోని అంకుసాపూర్ లో మంజూరైన వైద్య కళాశాల వైద్యవిద్య ప్రథమ సంవత్సరం తరగతులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రభుత్వం కల్పించిన వసతులతో వైద్య విద్యను అభ్యసించి భవిష్యత్తులో జిల్లాలో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కళాశాలలో సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి కోసం ప్రిన్సిపాల్ నాగార్జునాచారి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారని అన్నారు. కళాశాలలో ఫ్యాకల్టీ, సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. విద్యార్థులు క్రమం తప్పకుండా అల్పాహారం, భోజనం, నిద్ర సమయానుసారంగా తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునాచారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఆసిఫాబాద్ వైద్యాధికారులు, అధ్యాపకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించండి

సర్పంచ్‌లను ఘనంగా సన్మానించిన ఎంపీపీ, ఎంపీడీవో, ఎంపీటీసీలు

సిర్పూర్(టీ), జనవరి 30 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ లకు ప్రణాళికలు రూపొందించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బీపీడీపీ)పై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం అన్ని గ్రామాల సర్పంచ్‌లకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చునార్కర్ సువర్ణ, ఎంపీటీసీలు సుహేల్ అహ్మద్, మంగీలాల్, మండల కో ఆప్షన్ సభ్యుడు కీజర్ హుస్సేన్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జంగుబాయికి ప్రత్యేక పూజలు

లింగాపూర్,జనవరి 30: మండలంలోని గుమ్నూర్ బీ గ్రామంలో గ్రామస్తులు జంగుబాయికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని చిన్న పెద్దలందరూ భక్తిశ్రద్ధలతో సంస్కృతీ సంప్రదాయాలతో గుమ్నూర్ నుంచి కెరమెరి మండలంలోని పరందోలీలో ఉన్న జంగుబాయి పుణ్య క్షేత్రంలో ప్రత్యేక పూజల కోసం తరలి వెళ్లారు. ప్రత్యేక నైవేద్యంతో పాటు మొక్కులు చెల్లిస్తామని జంగు బాయి కటోడ కనక మోతీరాం తెలిపారు. భక్తులు పెందోర్ రాము, కనక చంద్రమోహన్, కనక కృష్ణ, తదితరులున్నారు.

పూజలకు బయల్దేరిన భక్తులు

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

రోడ్డు నిబంధనలు పాటించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 30 : వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్, జిల్లా రవాణాశాఖ అధికారి గంధం లక్ష్మితో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయవచ్చని, ప్రమాదాలకు గురయ్యే అవకాశం తక్కువన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని, మొబైల్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని తెలిపారు. అనంతరం అధికారులు, విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీధర్, జిల్లా రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

పంటల పరిశీలన

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 30: మండలంలోని సార్సాల, రాస్పల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రామకృష్ణ పర్యటించారు. యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి, మిరప పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరినాట్లు వేసుకునే వారం రోజుల ముందు గుంట నారుమడికి 400 గ్రాముల కార్పోప్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లి పంటలను పురుగుల బారి నుండి రక్షించుకోవాలని సూచించారు. మిరప పంట పూత,కాయ ఏర్పడే దశ, కాయ కోసే దశలో ఉన్నందునా, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బూడిద తెగులు ఆశించకుండా ఉండేందుకు 3 గ్రాముల నీటిలో గంధకం అజాక్సిస్ట్రోబిన్ లేదా టెబుకోనాజోల్, 1.5 గ్రాముల కార్పండిజం, మాంకోజెట్ లీటరు నీటిలో కలిపి వేయా లని రైతులకు సూచించారు.

విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 30: ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జిల్లాలోని ఆరె కుల స్థులు విజయవంతం చేయాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం లోని సంఘ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆరె కుల ప్రధాన సమస్య అయిన ఓబీసీ సర్టిఫికెట్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా, మండల, గ్రా మ కమిటీ నాయకులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కాజి, ప్రధాన కార్యదర్శి సప్త శ్రీనివాస్, నాయకులు ఇర్ధండి బాబా, చౌదరి గోపాల్, బొర్కుటే తిరుపతి, నాగపూరి మారుతి, గెడెకార్ సంతోష్ తదితరులు ఉన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

నర్సరీల్లో టేకు మొక్కలేవి..?

వాంకిడి : నర్సరీలో విత్తనాల బ్యాగులకు నీరు పడుతున్న కూలీలు

వాంకిడి, జనవరి 29: మండలంలో టేకు మొక్కలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదని, గతేడాది నుంచి గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఈ మొక్కలు అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీల్లో గతేడాది నుంచి టేకు జాతి మొక్కల విత్తనాలను నాటకుండానే ఇతర ఉపయోగం లేని మొక్క ల విత్తనాలను పెంచు తున్నారని, రైతులకు ఉపయోగపడే టేకు జాతి మొక్కలను పెంచాలని మండల రైతులు కోరుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం టేకు మొక్కలు పెంచే రైతులకు మొక్కకు ఈజీఎస్ కింద రూ.5 చొప్పున రైతులకు చెల్లించి టేకు వనాలను పెంచే విధంగా ప్రోత్సహించిందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పుడు నర్సరీలో టేకు జాతి మొక్కలను పెంచడం అధికారులు మరిచి పోతున్నారని మండల రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నర్సరీల్లో టేకు మొక్కలను పెంచి, గతం లో మాదిరిగానే పంపిణీ చేసి ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు . ఈ విషయమై ఏపీవో శ్రావణ్‌ను వివరణ కోరగా గతేడాది నుంచి నర్సరీలకు టేకు మొ క్కల విత్తనాల సరఫరా జరగడం లేదని చెప్పారు.